











వైరా వాసికి జాతీయ పురస్కారం


అవార్డు అందుకుంటున్న హరికిషోర్

వైరా: వైరాకు చెందిన జ్యోతిష్య పండితుడు డాక్టర్ గుండు హరికిషోర్‌కు కాకతీయ వైభవం జాతీయ కీర్తి పురస్కారం లభించింది. హనుమకొండలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఫిలాంత్రోఫీ సొసైటీ చైర్మన్ అద్దంకి రాజా, సాహితీ వేదిక అధ్యక్షుడు డాక్టర్ చిలుముల బాల్‌రెడ్డి, ఏపీ రాష్ట్ర ప్రెస్ అకాడమీ వైస్ చైర్మన్ తిలక్, కేంద్ర ప్రభుత్వ భరతనాట్య అకాడమీ సభ్యురాలు డాక్టర్ భారతి చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా హరికిషోర్‌ను పలువురు అభినందించారు







జోరుగా మువ్వన్నెల జెండా విక్రయాలు


దుకాణాల వద్ద త్రివర్ణ పతాకాలను కొనుగోలు చేస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: మండలంలోని అన్ని దుకాణాల్లో జాతీయ జెండాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా పలు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, యూనియన్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు మువ్వన్నెల జెండా ఎగురవేసేందుకు ముస్తాబయ్యాయి. కేంద్ర ప్రభుత్వం హర్ ఘర్ తిరంగా పేరిట ఇంటింటా జెండా పండుగకు పిలుపు నివ్వటంతో పతాకాలను ఇళ్లపై ఎగరేసేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. పిల్లలు, పెద్దలు పలు దుకాణాల్లో త్రివర్ణ తోరణాలు, టోపీలు, బ్యాడ్జీలతో పాటుగా స్వీట్లు, చాక్లెట్లు, బిస్కెట్లు విక్రయించడంతో దుకాణాలు రద్దీగా మారాయి.

సమరయోధుల చిత్ర ప్రదర్శన..

77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని సత్తుపల్లిలోని విశ్వశాంతి విద్యాలయంలో 77 మంది స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలతో సోమవారం పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శన ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్య సమరంలో సేవలందించిన ఉద్యమకారుల జీవితాన్ని నేటితరం విద్యార్థులకు తెలిపేందుకే ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో సింగరేణి పీఓ వెంకటాచారి, సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

మధిర/తల్లాడ/సత్తుపల్లిటౌన్/ఏన్కూరు: ప్రతిఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావులు తెలిపారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం మధిర పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. తల్లాడలోని మల్లవరం ప్రాథమిక పాఠశాల, ఏన్కూరు పాఠశాల విద్యార్థులతో ప్రదర్శన నిర్వహించారు. సత్తుపల్లిలోని ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి జాతీయ జెండాలతో నినాదాలు చేశారు. అనంతరం ఇంటింటికీ జెతీయ పతాకాలను పంపిణీ చేసి.. జెండా ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు రమేష్, చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణారావు, నాగభూషణం, ప్రకాష్, రాము, సోమేశ్వరరావు, మోహన్‌రావు, రామకృష్ణ, వెంకటరామారావు, కృష్ణారావు, నాగేశ్వరరావు, శ్రీను, నాగస్వామి, నాయుడు రాఘవరావు, సుదర్శన్‌మిశ్రా, ప్రసాద్, నరేష్, రమేష్, బీపీ నాయక్, వెంకటేశ్వర్లు, కార్తీక్, దర్గయ్య పాల్గొన్నారు.

మరమ్మతులు చేపట్టాలి

చింతకాని: అధ్వానంగా మారిన ఖమ్మం–బోనకల్ ప్రధాన రాహదారికి మరమ్మతులు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. సోమవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పందిళ్లపల్లి నుంచి నాగువంచ వరకు పాదయాత్ర చేపట్టారు. నాయకులు వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, భాస్కర్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తులు పరిశీలన

బోనకల్: మండలంలో 'గృహలక్ష్మి'కి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తులను తహసీల్దార్ పున్నం చందర్ పరిశీలించారు. మండలంలోని రావినూతల, గార్లపాడు, గోవిందాపురం, లక్ష్మీపురం గ్రామాల్లో సోమవారం నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారు అర్హులా కాదా అనే విషయాన్ని పరిశీలించారు. అనంతరం లబ్ధిదారుల వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు లక్ష్మణ్ నాయక్, సత్యనారాయణ గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

డాక్టరేట్ సాధించిన సుధాకర్‌కు సన్మానం

వైరా: రాజనీతి శాస్త్రంలో డాక్టరేట్ సాధించిన డాక్టర్ బొర్రా సుధాకర్‌ను సోమవారం వైరాలో సత్కరించారు. వైరా మాజీ సర్పంచ్ బొర్రా వెంకటేశ్వరరావు తనయుడు, మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ సోదరుడైన సుధాకర్ వ్యవసాయ శాఖలో ఉద్యోగం చేస్తూ కాకతీయ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ సాధించారు. వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, నాయకులు మిట్టపల్లి నాగేశ్వరావు తదితరులు ఆయనను సన్మానించగా గుమ్మా రోశయ్య, వై.రవికుమార్, పి.సైదులు, మచ్చా రామారావు తదితరులు పాల్గొన్నారు.



యథాస్థానంలో సమాధులు

మధిర: మండలంలోని బుచ్చిరెడ్డిపాలెం గ్రామంలో తొలగించిన సమాదిరాళ్లను సోమవారం తిరిగి యథాస్థానంలో ఏర్పాటు చేశారు. ఈ నెల 14న సాక్షి దినపత్రికలో సమాధుల తొలగింపు అనే శీర్షికన వచ్చిన కథనానికి స్పందించిన కార్యదర్శి హేమలత.. తొలగించిన సమాధులను గతంలో ఉన్న స్థానంలో ఏర్పాటు చేయించారు. దీంతో గ్రామస్తులు సాక్షి దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ చైర్మన్‌గా రమాకాంత్

తల్లాడ: మండలంలోని కేశ్వాపురం సీతారామాంజనేయ ఆలయ కమిటీ చైర్మన్‌గా కట్టా రమాకాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే, ప్రధాన కార్యదర్శిగా చావా విష్ణువర్ధన్‌రావు, కోశాధికారిగా సాదం రమేష్‌ను ఎన్నుకోగా సర్పంచ్ వనిగండ్ల అలేఖ్య అశోక్ తదితరులు అభినందించారు.

ఆర్థిక సాయం..

తల్లాడ: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన పలువురు యువకులు ప్రమాదంలో రెండు కళ్లు కోల్పోయి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న అన్వర్‌కు రూ.16,200 నగదును హసోమవారం అందించారు. ఈ నెల 13న 'సాక్షి'లో సాయం చేయండి అని ప్రచురితమైన వార్తకు స్పందించిన యువకులు సాయం అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు.



ఎంబీబీఎస్‌లో గోల్డ్ మెడల్


శిరీష

వైరారూరల్: మండలంలోని స్నానాల లక్ష్మీపురానికి చెందిన మల్లు శేషయ్య – ఇందిరమ్మ కుమార్తె శిరీష హైదరాబాద్‌లోని గాంధీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసి గోల్డ్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా నిరుపేద కుటుంబానికి చెందిన ఆమె గోల్డ్ మెడల్, పట్టా అందుకోగా పలువురు అభినందించారు.





